సాక్షి
అన్నమయ్య జిల్లా
గురువారం । 12 । సెప్టెంబర్ । 2024



ఎర్రచందనం దుంగలు స్వాధీనం
రాయచోటి-మదనపల్లె మార్గంలో చేపట్టిన వాహనాల తనిఖీల్లో 13 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకొని ఇద్దరు స్మగ్లర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. -8లో



ఐదో రోజూ.. అదే జోరు
మహాగణపతి ఉత్సవాలు బుధవారం ఐదో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన గణనాథుని లడ్డూ వేలం పాటలో భక్తులు పోటాపోటీగా పాల్గొన్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.230	రూ.280
రెండోరకం	రూ.140	రూ.220

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 148 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

జపాన్‌లో ఉద్యోగావకాశాలు

రాయచోటి (జగదాంబసెంటర్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎస్‌వీఐఎస్ హెచ్‌ఆర్ ఆధ్వర్యంలో ఏఎన్‌ఎం/జీఎన్‌ఎం/బీఎస్సీ నర్సింగ్ చదివిన వారికి జపనీస్‌భాష నేర్పడంతో పాటు జపాన్ దేశంలో నర్సులుగా ఉద్యోగావకాశం కల్పించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 32 సంవత్సరాలలోపు వయస్సు కలిగి జపాన్ దేశంలో పనిచేయడానికి ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. శిక్షణ కాలం 6 నెలలని, శిక్షణ ఎస్‌వీఐఎస్ హెచ్‌ఆర్ బెంగళూరులో జరుగుతుందని తెలిపారు. శిక్షణ రుసుం రూ.3 లక్షలు కాగా పాక్షిక శిక్షణ రుసుము రూ.50 వేలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ రూ.25 వేలు చెల్లిస్తుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 9988853335 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన తెలియజేశారు.

రాయచోటిలో సినిమా షూటింగ్



వండాడి వెంకటేశ్వర్లు ఇంటిలో సినిమా షూటింగ్ సందడి

రాయచోటి టౌన్: రాయచోటిలో సినిమా షూటింగ్ సందడి నెలకొంది. రాయచోటి ప్రాంతానికి చెందిన అభి, సుధా కల్యాణ మండపం యజమాని బెల్లం రామకృష్ణారెడ్డి నిర్మాతగా, దర్శకుడిగా నిర్మిస్తున్న ''దేవగుడి'' షూటింగ్ జరుగుతోంది. బుధవారం ఉదయం రాయచోటి - గాలివీడు రోడ్డులోని వండాడి వెంకటేశ్వర్లు భవంతిలో రాయలసీమ వంటకాల వడ్డనపై చిత్రీకరించారు. ఈ సినిమాలో హీరోగా అభినవ్, హీరోయిన్‌గా అనుశ్రీలు నటిస్తుండగా సంగీత దర్శకుడు రఘుకుంచె ఒక ప్రత్యేక పాత్రలో సంగీతం అందిస్తూనే నటిస్తున్నారు.

పీజీ ఫలితాలు విడుదల

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం పోస్ట్ గ్రాడ్యుయేషన్ 2వ సెమిస్టర్ ఫలితాలను విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథ్ రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య ఎన్. ఈశ్వర్ రెడ్డితో కలిసి బుధవారం సాయంత్రం తన ఛాంబర్లో విడుదల చేశారు. ఉత్తమ ఫలితాలు సాధించిన శాఖలను, విద్యార్థులను అభినందించారు.

పోషకాహారంతో రక్తహీనత నివారణ



మాతా శిశు సంరక్షణ కార్డులను తనిఖీ చేస్తున్న వైద్యాధికారి నాగరాజు


సిద్దవటం: రక్తహీనత నివారణకు గర్భిణులు ఆకుకూరలు, పాలు, గ్రుడ్లులాంటి పోషకాహారం తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. సిద్దవటం మండలం రామకృష్ణాపురం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం జరుగుతున్న తల్లి, బిడ్డ టీకా కార్యక్రమం, పోషకాహార మాసోత్సవాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాతా శిశు సంరక్షణ కార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరోగ్యానికి అవసరమయ్యే పోషకాలు, ఆహారపు అలవాట్ల గురించి గర్భిణులకు, బాలింతలకు వివరించారు. ఈ కార్యక్రమాలను ఈనెల అంతా అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహించి అంగన్వాడీ, ఆరోగ్య కార్యకర్తలు వారికి సంబంధించిన యాప్‌లలో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాధవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివకుమార్, సూపర్‌వైజర్లు జ్యోతికళ, నాగవల్లి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాబుకు కడపంటే మంట!

సీఎం చంద్రబాబు కడపపై మరోసారి వివక్ష చూపించారు. ఇక్కడి ప్రజలు టీడీపీకి అధిక సీట్లు కేటాయించినా సరే.. తనలోని మోసపు నైజాన్ని.. సీమపై తన నిజస్వరూపాన్ని బయటపెట్టారు. పులివెందుల మెడికల్ కళాశాలకు సీట్ల కేటాయించొద్దంటూ ఎన్‌ఎంసీకి లేఖ రాసి వైఎస్ ఫ్యామిలీకి కంచుకోటగా ఉన్న పులివెందులపై తన కడుపుమంటను మరోమారు వెళ్లగక్కారు.

- పులివెందుల మెడికల్ కళాశాలపై వివక్ష..
- సీట్ల కేటాయింపుపై ఎన్‌ఎంసీ అనుమతులిచ్చినా అండర్ టేకింగ్ లెటర్ ఇవ్వని సీఎం చంద్రబాబు
- ఫ్యాకల్టీ ఉన్నా ఈ ఏడాది ఎంబీబీఎస్ సీట్ల భర్తీ లేనట్లే
- రాష్ట్ర ప్రభుత్వ వివక్షపై మండిపడుతున్న జిల్లా వాసులు





పులివెందుల మెడికల్ కళాశాల

సాక్షి ప్రతినిధి, కడప: 'నేను రాయలసీమలోనే పుట్టాను, సీమ బిడ్డనం'టూ జబ్బలు చరుచుకునే సీఎం చంద్రబాబు అవన్నీ మాటలకేనని రుజువు చేశారు. తాజాగా పులివెందుల మెడికల్ కాలేజీకి మంజూరైన 50 మెడికల్ సీట్లు వద్దంటూ నేషనల్ మెడికల్ కమీషన్‌కు లేఖ రాసి కడపపై తన అక్కసును బయట పెట్టారు. చంద్రబాబు తీరుపై జిల్లా వాసులు భగ్గుమంటున్నారు. చంద్రబాబుకు రాయలసీమ ప్రజల ఓట్లు కావాలి ..సీట్లు కావాలి.. కానీ..ఇక్కడ అభివృద్ధి ఆయనకు పట్టదంటూ తూర్పారబడుతున్నారు.

అభివృద్ధే లక్ష్యంగా...

సీమ అభివృద్ధికి దివంగత సీఎం వైఎస్సార్, మాజీ సీఎం వైఎస్ జగన్ విశేష కృషి చేశారు. ఇక సొంత గడ్డపైన మమకారంతో పులివెందులను మరింతగా అభివృద్ధి చేశారు. అందుకే దశాబ్దాలుగా పులివెందుల ప్రజలు వైఎస్ కుటుంబానికి పట్టం కడుతూ వస్తున్నారు. అక్కడ ప్రజలకు వైఎస్ రాజశేఖరరెడ్డి సాగునీరు తీసుకొచ్చి పంటలను సస్యశ్యామలం చేశారు. ఇక వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా పరిశ్రమలతోపాటు ఓ మెడికల్ కాలేజీ నిర్మాణం కూడా చేపట్టారు. సామాన్యులకు ఉన్నత స్థాయి వైద్యం అందించేందుకు సంకల్పించి.. రూ.500 కోట్లతో పులివెందుల మెడికల్ కాలేజీ నిర్మాణం చేపట్టారు. తాజాగా ఎన్‌ఎంసీ అనుమతులు కూడా దక్కాయి. ఈఏడాది 50ఎంబీబీఎస్ సీట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కాకపోతే పెండింగ్ పనులు పూర్తి చేస్తామని ధ్రువీకరిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ కోరింది. ఇక్కడే చంద్రబాబుకు ఓ సాకు దొరికింది. పూర్తయిన పనులు కొనసాగించేందుకు చంద్రబాబు సర్కార్‌కు మనసు రాలేదు. అంతే.. సీట్లు అవసరం లేదంటూ ఎన్‌ఎంసీకి లెటర్ రాసి కక్ష సాధింపు చర్యల్లో పరాకాష్టకు చేరారు.

ఫ్యాకల్టీ...వసతులున్నా...

ఎన్‌ఎంసీ చైర్మన్ డాక్టర్ బీఎన్ గంగాధర్ నేతృత్వంలో 2024 జూలై 31న ఎన్‌ఎంసీ కమిటీ సమావేశమై పులివెందుల ప్రభుత్వ మెడికల్ కళాశాల రికార్డులు, ఫ్యాకల్టీ, వసతులను పరిశీలించారు. అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, ఫార్మకాలజీ, మైక్రో బయాలజీ విభాగాలు పరిశీలన తర్వాత సంతృప్తి చెంది, 50ఎంబీబీఎస్ సీట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోనే కాదు...దేశంలోని ఏ రాష్ట్రం అయినా మాకు అదనంగా మెడికల్ సీట్లు ఇవ్వండి అంటూ ఎన్‌ఎంసీని ప్రాధేయపడుతుంటాయి. అక్కడి విద్యార్థులకు అదనంగా మెడికల్ సీట్లు కల్పించాలనే తాపత్రయం ఆయా రాష్ట్రాల్లో కనిపిస్తుంది. కానీ మంజూరైన మెడికల్ సీట్లు వద్దంటూ లేఖ రాసిన ఏకైక సీఎంగా చంద్రబాబు దేశ చరిత్రలో అపఖ్యాతి మూటగట్టుకున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

నాడూ అదే వివక్ష

ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో పద్మావతి మెడికల్ కళాశాలల్లో సీట్లు రాయలసీమ విద్యార్థులతోనే భర్తీ చేయాలనే నిబంధనలను నాటి చంద్రబాబు సర్కార్ తోసి పుచ్చుతూ జీఓ 130 తీసుకొచ్చి రాయలసీమకు అన్యాయం చేసింది. తాజాగా ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో పులివెందుల మెడికల్ కళాశాలకు 50సీట్లు ఎన్‌ఎంసీ కేటాయిస్తే చంద్రబాబు సర్కార్ మోకాలొడ్డుతోంది. స్వతహాగా సీఎం చంద్రబాబుకు రాయలసీమ అన్నా.. ముఖ్యంగా కడప, పులివెందుల అన్నా ఎక్కడ లేని కోపం, ఆక్రోశం వస్తుంది. 2014లో గెలిచిన తర్వాత ఏకంగా బహిరంగ సభలోనే మీరు నాకు ఓటేశారా...మీకు అభివృద్ధి చేయడానికి..? అంటూ ప్రశ్నించారు. ఈమారు ఓట్లు సీట్లు ఇచ్చినా ఈప్రాంతం పట్ల అక్కసు, అసూయ పోవడం లేదని పలువురు మండిపడుతున్నారు. తక్షణమే పులివెందుల మెడికల్ కళాశాలలో సీట్ల భర్తీకి అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

ప్రజాప్రతినిధులు ప్రతిఘటించాలి



పులివెందుల మెడికల్ కళాశాలకు రాష్ట్ర ప్రభుత్వం అండర్ టేకింగ్ ఇవ్వకపోవడం రాయలసీమపై ఉన్న కక్షను తెలియజేస్తుంది. సీఎం చంద్రబాబు అతి ముఖ్యమైన ప్రజారోగ్య రంగాన్ని నిర్లక్ష్యం చేయడం బాధాకరం. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పులివెందులలో మెడికల్ కళాశాల నిర్మిస్తే బాబు వైఖరి వల్ల నేడు దాని ఫలితాలు అందని పరిస్థితి ఏర్పడింది. వైద్య రంగాన్ని ప్రైవేటుపరం చేయడంలో అర్థం లేదు.అధికార పార్టీ ఎమ్మెల్యేలు నోరు మెదపకపోవడం విచారకరం. రాయలసీమ ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రతిఘటించాలి.
– సీహెచ్ చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యక్షులు, రాయలసీమ కార్మిక కర్షక సమితి

'సీమ'పై వివక్ష సరికాదు



చంద్రబాబు ప్రభుత్వం ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహిస్తోంది. గత ప్రభుత్వం పులివెందులలో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలకు ఫ్యాకల్టీ తదితర విషయాల్లో రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన అండర్ టేకింగ్ ఇవ్వడానికి ఆసక్తి చూపకపోవడం విచారకరం. రాయలసీమ పట్ల వివక్ష ప్రదర్శించడం సరికాదు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబు అన్ని ప్రాంతాలను సమ దృష్టితో చూడాలి.
– ఎ.రఘునాథరెడ్డి, సామాజిక కార్యకర్త, కడప

వివక్ష తగదు



ప్రభుత్వాలు ఏవైనా విద్యాభివృద్ధికి సంబంధించిన విషయాల్లో వివక్ష సరికాదు. ఇలాంటి నిర్ణయాల వల్ల పేద, మధ్య తరగతికి చెందిన పిల్లలకు అన్యాయం జరిగే అవకాశం ఉంటుంది. ప్రస్తుత ఎన్‌డీఏ ప్రభుత్వం పులివెందుల మెడికల్ కళాశాలకు అండర్ టేకింగ్ లెటర్ ఇచ్చి ఉంటే 50 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరి ఉండేది.
– వేణుగోపాల్‌రెడ్డి, రాయనపల్లి, చెన్నూరు

విద్యార్థులకు అన్యాయం



పులివెందుల పట్టణంలోని కడపరోడ్డులో గత ప్రభుత్వం సుమారు 56 ఎకరాల్లో రూ.500కోట్లతో మెడికల్ కళాశాలను నిర్మించింది. కూటమి ప్రభుత్వం పులివెందుల మెడికల్ కళాశాలకు కేటాయించిన సీట్లను వెనక్కి తీసుకోమని చెప్పడంతో ఈ ప్రాంతంలో చదువుతున్న మెడికల్ విద్యార్థులకు అన్యాయం చేసినట్లయింది.
– కోళ్లభాస్కర్, పులివెందుల

ఉన్నత లక్ష్యాన్ని నీరుగార్చారు



పులివెందుల ప్రాంతంలోని నిరుపేదలకు మెరుగైన వైద్యసేవలు అందించే విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మెడికల్ కళాశాలను ఏర్పాటు చేశారు. ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందాలంటే దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. ఇక్కడే నాణ్యమైన విద్యతో పాటు వైద్యం అందించవచ్చన్న లక్ష్యంతో కళాశాలను ఏర్పాటు చేశారు. కానీ కూటమి ప్రభుత్వం కొత్త వైద్య కళాశాలకు వసతులు కల్పించలేమని చేతులెత్తేయడం దారుణం.
– అరుణ, పులివెందుల

పీఎం విశ్వకర్మ యోజన పథకంపై అవగాహన

అధికారులకు కలెక్టర్ శ్రీధర్ ఆదేశం



రాయచోటి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం కింద రిజిస్ట్రేషన్ల నిమిత్తం చేతివృత్తి వారిలో అవగాహన పెంచాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమలశాఖ ఆధ్వర్యంలో పథకం అమలుపై అధికారులు, సభ్యులతో జిల్లాస్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. పథకం కింద ఎంపికై ప్రాథమిక శిక్షణ పూర్తిచేసుకున్న లబ్ధిదారులకు మొదటి విడతలో రుణ సౌకర్యం అందించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. శిక్షణ పొందిన వారికి రూ. 15 వేలు విలుగ గల టూల్ కిట్, స్టైఫండ్, లక్షరూపాయల రుణ సౌకర్యంతోపాటు అధునాత పనిముట్లు అందజేస్తారన్నారు. జిల్లా పరిశ్రమల శాఖ అధికారి సూరిబాబు, డీపీఓ ధనలక్ష్మీ, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, జీఎస్‌డబ్ల్యుఎస్ అధికారి లక్ష్మీనారాయణ, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ పాల్గొన్నారు.

- కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయా(కేజీబీవీ)ల్లోకి బయటి వ్యక్తులను అనుమతిస్తే కఠినచర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ శ్రీధర్ కేజీబీవీ ప్రధానోపాధ్యాయులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో కేజీబీవీ, ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాళ్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. లక్కిరెడ్డిపల్లె అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో జరిగిన సంఘటనను దృష్టిలో ఉంచుకొని అలాంటివి పునరావృతం కాకుండా కేజీబీవీ పాఠశాలల ప్రిన్సిపాళ్లు జాగ్రత్తగా ఉండాలన్నారు.జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, రాజంపేట సబ్ కలెక్టర్ నదియాదేవి పాల్గొన్నారు.
- జిల్లాలోని దేవాలయ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో దేవాలయ భూముల స్థితిగతులు, వాటి పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. జిల్లాలో 1633 హిందూ ఆలయాలు, మఠాలు, ధార్మిక సంస్థలు ఉన్నాయని జిల్లా దేవదాయ శాఖ అధికారి విశ్వనాథ్ కలెక్టర్‌కు వివరించారు. వీటికి ఏడాదికి రూ.2 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు ఆదాయం వస్తుందన్నారు. అలాగే 30 స్వచ్ఛంద ధార్మిక సంస్థలు ఉన్నాయని దేవదాయ శాఖ అధికారి వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ హిందూ దేవాలయాలు, ధార్మిక సంస్థలకు వస్తున్న ఆదాయాలను సక్రమంగా నిర్వహించడం, సంస్థల ఆస్తులను రక్షించడమే ప్రధాన లక్ష్యమన్నారు. సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, ఆర్డీఓ రంగస్వామి పాల్గొన్నారు.

ఖజానా కుంభకోణంపై దర్యాప్తు వేగవంతం

- పన్ను వసూళ్ల నివేదిక ఇవ్వాలని కేంద్ర ఆర్థికశాఖకు విచారణాధికారి లేఖ
- ఈ మెయిల్ ద్వారా మరోసారి అభ్యర్థన
- మరోవైపు ఖజానాశాఖ డిప్యూటీ డైరెక్టర్ బృందం విచారణ



తంబళ్లపల్లె ఉప ఖజానా కార్యాలయం

బి.కొత్తకోట : బోగస్ ఏఐఎన్, ట్యాన్ నంబర్లతో ఆదాయపన్నుశాఖ నుంచి రీఫండ్‌గా అధిక మొత్తాలను పొంది రూ.కోట్లు కొల్లగొట్టిన వ్యవహారంలో నమోదైన కేసు దర్యాప్తు వేగవంతమైంది. తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు, వాల్మీకిపురం ఉప ఖాజానా శాఖల పరిధి నుంచి అక్రమంగా పొందిన రీఫండ్ నిధుల వ్యవహారంలో ఎన్నో నిజాలు వెలుగులోకి రానున్నాయి. ప్రధానంగా ప్రభుత్వ ఉద్యోగులు ఆదాయపన్ను శాఖకు చెల్లించిన వేతన పన్నులకు సంబంధించిన జాబితాను ఇవ్వాలని కోరుతూ ఈ కేసు విచారణ సాగిస్తున్న మదనపల్లె డీఎస్పీ రెడ్డెయ్యనాయుడు కేంద్రప్రభుత్వ ఆర్థికశాఖకు లేఖ రాశారు. దీంతోపాటు ఈ మెయిల్ ద్వారా నివేదికలు సత్వరమే పంపాలని, కేసు దర్యాప్తును కొలిక్కి తీసుకురావాల్సి ఉందని ఆయన కోరారు. దీంతో ఖజానా కుంభకోణం వ్యవహారంలో ఆదాయపన్నుశాఖలోని ఇంటి దొంగలు కూడా బయటకు రానున్నారు. 2023 డిసెంబర్ 13న తిరుపతి ఆదాయపన్నుశాఖ అధికారి ఎస్.రాజశేఖర్ ఫిర్యాదు మేరకు అప్పటి మదనపల్లె టూటౌన్ సీఐ మురళీకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే కేసు తీవ్రతను గుర్తించిన అప్పటి జిల్లా ఎస్పీ హర్షవర్దన్‌రాజు కేసు దర్యాప్తు బాధ్యతను డీఎస్పీకి అప్పగించారు. అప్పటి నుంచి డీఎస్పీ నేతృత్వంలో దర్యాప్తు మొదలవగా రాజకీయ పరిస్థితులు, ఎన్నికల కారణంగా గత డీఎస్పీలు కేశ వ్ప, ప్రసాద్‌రెడ్డిలు ముందుకు తీసుకెళ్లలేకపోయారు. ప్రస్తుతం సాధ్యమైనంత త్వరగా కేసును కొలిక్కి తీ సుకొచ్చి ముగింపు పలకాలని విచారణాధికారి భావిస్తున్నారు. దీంతో కేసు మొత్తానికి కీలకమైన ఉద్యోగుల పన్ను చెల్లింపునకు సంబంధించిన నిధులు ఆదాయపన్నుశాఖకు ఏమేరకు జమ అయ్యాయి, మొత్తం నిధులు జమ అయ్యాయా లేదా అన్నదానిపై అక్రమాలు జరిగిన ఏడాది నుంచి వివరాల నివేదిక పంపాలని డీఎస్పీ కేంద్ర ఆర్థిక శాఖకు లేఖ రాశారు. లేఖతో పాటు ఈ మెయిల్ ద్వారా ఈ విషయాన్ని తెలియజేసి నివేదిక కోరారు.

డీడీ బృందం విచారణ

ఖజానా కుంభకోణంపై ఆశాఖ డిప్యూటీ డైరెక్టర్ సురేంద్ర ఆధ్వర్యంలోని బృందం విచారణ వేగం పెంచింది. కొంతకాలంగా బో గస్ ఏఐఎన్, ట్యాన్ నంబర్లతో కోట్లు దోచుకున్న వ్యవహారంపై శాఖపరమైన విచారణకు డైరెక్టర్ మోహన్‌రావు నిర్ణయించి బృందాన్ని నియమించారు. ఈ బృందం విచారణ దాదా పుగా పూర్తి కావొచ్చిందని తెలిసింది. ఈ విచారణలో ప్రస్తుతం గుర్తించిన దానికంటే అధికంగా మోసాలు జరిగాయా, కొత్త ఎస్‌టీఓల పరిధిలో అక్రమాలు గుర్తించారా, ఇప్పటికే అక్రమాలు వెలుగుచూసిన ఎస్‌టీఓల పరిధిలో కొత్తగా అక్రమార్కులను గుర్తించారా, మరిన్ని వ్యవహారాలు వెలుగులోకి వచ్చాయా అన్నది తేలాల్సి ఉంది. కాగా ఈ విచారణ పూర్తి కావొచ్చిందని నివేదిక కోసం ఎదురుచూస్తున్నామని ఖజానాశాఖ డైరెక్టర్ మోహన్‌రావు తెలిపారు.

తిరుపతి-సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక రైలు

కడప కోటిరెడ్డిసర్కిల్: దసరా, దీపావళి పండుగల రద్దీ నేపథ్యంలో తిరుపతి-సికింద్రాబాద్-తిరుపతి (07489/07490)ల మధ్య కడప మీదుగా ప్రత్యేక రైలును నడపనున్నారని కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. సికింద్రాబాద్ నుంచి తిరుపతికి అక్టోబరు నెలలో 5, 12, 19, 26, నవంబరులో 2, 9 తేదీల్లో బయలుదేరుతుందన్నారు. అలాగే తిరుపతి నుంచి సికింద్రాబాదుకు అక్టోబరు 8, 15, 22, 29, నవంబరు 5, 12 తేదీలలో నడుస్తుందన్నారు. ఈ రైలు కడప, ఎర్రగుంట్లలో స్టాపింగ్‌లో ఏర్పాటు చేశారన్నారు. సికింద్రాబాదులో శనివారం రాత్రి 10.15 గంటలకు బయలుదేరి కాచిగూడ, హుందానగర్, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల, కర్నూలు, డోన్, గుత్తి, ఎర్రగుంట్ల, కడప, రేణిగుంట మీదుగా తిరుపతికి మరుసటిరోజు ఉదయం 10.10గంటలకు చేరుతుందన్నారు. తిరిగి ఈ రైలు మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి ఇదే మార్గంలో మరుసటిరోజు తెల్లవారుజామున 4 గంటలకు సికింద్రాబాద్ చేరుతుందన్నారు.ఈ రైలుకు రిజర్వేషన్‌సౌకర్యం ఉందని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు సహకరిస్తాం

సాక్షి ఎఫెక్ట్..




లబ్ధిదారులతో మాట్లాడుతున్న డీఈ వెంకటరెడ్డి

బి.కొత్తకోట: ఇళ్ల నిర్మాణాలు సత్వరమే చేపడితే అన్ని విధాలా సహకరిస్తామని ఈఈ వెంకటదాస్, డీఈ వెంకటరెడ్డి పేర్కొన్నారు. ఈనెల 9న 'ఎక్కడి పనులు అక్కడే'శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై హౌసింగ్ అధికారులు స్పందించారు. బుధవారం బి.కొత్తకోట నగరపంచాయతీ కార్యాలయ ఆవరణలో హౌసింగ్ లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈ, ఈడీ మాట్లాడుతూ... బద్దిపల్లిగుట్ట, కురవానికుంటల లేఅవుట్లలో రహదారి పనులకు రూ.7లక్షలతో ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. మౌలికవసతులను కల్పించి సమస్యలు తీరుస్తామన్నారు. నిర్మాణాలు చేపట్టిన వెంటనే బిల్లులు ఖాతాలో పడతాయని తెలిపారు. కంటేవారిపల్లె లేఔట్ వద్ద ఇసుక డంపింగ్ ఉందని అక్కడి నుంచి ఉచితంగా తరలించుకోవచ్చునని వివరించారు. అనంతరం లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో మేనేజర్ రమాదేవి, ఏఈ లావణ్య, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు అలేఖ్య, సరోజ్, జియా తదితరులు పాల్గొన్నారు.

యువతకు సదవకాశం

- క్విజ్ పోటీలు నిర్వహిస్తున్న ఆర్‌బీఐ
- గెలిస్తే..లక్షాధికారి మీరే
- 17లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు



మదనపల్లె సిటీ: లక్షాధికారి కావడానికి రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) యువతకు సువర్ణావకాశం కల్పిస్తోంది. ఆర్‌బీఐ 90 సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా దేశ వ్యాప్తంగా ఏదేని డిగ్రీ చదువుతున్న వారికి ఆర్‌బీఐ 90 క్విజ్ పేరిట పోటీలు నిర్వహిస్తుంది. ఇప్పటికే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు ఈనెల 17వ తేదీ వరకు అవకాశం ఉంది. ఈనెల 19 నుంచి 21వ తేదీ ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు పోటీలు నిర్వహిస్తారు.

అర్హులు ఎవరంటే...

2024 సెప్టెంబర్ 1 నాటికి 25 ఏళ్లలోపు ఉండి ఏదైనా డిగ్రీ చదివి ఉండాలి. www.rbi90quiz.in లో పేరు,గుర్తింపు కార్డు నంబరు వంటివి నమోదు చేయాలి. ఎలాంటి ప్రవేశ రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు. ఒక కాలేజీ నుంచి ఎంత మందైనా దరఖాస్తు చేసుకోవచ్చు.

నాలుగు దశల్లో పోటీలు

పోటీలు జిల్లా, రాష్ట్ర, జోనల్, జాతీయ స్థాయిల్లో ఉంటాయి. బృందానికి కనీసం ఇద్దరు ఉండాలి. తొలుత జిల్లా స్థాయి పోటీలు ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. ఇందులో 36 బహుళ ఐచ్ఛిక ప్రశ్నలు ఉంటాయి. వీటికి 15 నిమిషాల సమయం ఉంటుంది. అంధులకు అదనంగా మరో 15 నిమిషాలు ఇస్తారు. జిల్లాస్థాయిలో ప్రతిభ చూపిన 90 బృందాలను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలిచిన బృందాలను జోనల్‌గా విభజించి అనంతరం జాతీయ స్థాయికి ఎంపిక చేసి పోటీలు నిర్వహిస్తారు. విజేతలకు రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు గెలుచుకునే అవకాశం ఉంటుంది. ఆంగ్లం, హిందీ భాషల్లో పోటీలు ఉంటాయి. జాతీయ, అంతర్జాతీయ ఆర్థిక వ్యవహారాలు, ఆర్థిక వ్యవస్థ, తదితర అంశాలపై ప్రశ్నలుంటాయి.

డిగ్రీ కళాశాలలు: 52
ప్రభుత్వ కళాశాలలు: 9
ప్రైవేట్: 43
విద్యార్థులు: 21 వేలు



నగదు బహుమతులు (రూ. లక్షల్లో)

స్థాయి	ప్రథమ బహుమతి	ద్వితీయ	తృతీయ
రాష్ట్ర	2	1.50	1
జోనల్	5	4	3
జాతీయ	10	5	6

వసతి,రవాణా ఖర్చులు

జిల్లా స్థాయి పోటీలు మాత్రమే ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. ఆ తర్వాత జరిగే రాష్ట్ర, జోనల్, జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు రవాణా, వసతి ఖర్చులను ఆర్‌బీఐ భరిస్తుంది. విద్యార్థి వెంట ఒక అధ్యాపకుడు వెళ్లడానికి అయ్యే వ్యయాన్ని సైతం ఆర్‌బీఐ చూసుకుంటుంది. రిజిస్ట్రేషన్ సమయంలో అందజేసిన వివరాలు తప్పుగా తేలితే అనర్హులుగా నిర్ణయిస్తారు.

క్లుప్తంగా

ఒకరికి పాము కాటు.. మరొకరు ఆత్మహత్యాయత్నం

కురబలకోట : మండలంలో బుధవారం వేర్వేరు సంఘటనల్లో ఒకరు పాము కాటుకు గురికాగా మరో మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని ముదివేడు గ్రామం రెడ్డివారిపల్లెకు చెందిన మహిళా రైతు రమణమ్మ పొలం వద్ద పనులు చేస్తుండగా కాలిపై పాము కాటేసింది. 108 వాహనంలో హుటాహుటిన ఆమెను మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తీసుకెళ్లారు. ముదివేడు గ్రామం ఎనుములవారిపల్లెకు చెందిన వసంత కుటుంబ సమస్యల కారణంగా బుధవారం మధ్యాహ్నం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. ఈమె మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది.

పాముకాటుతో మహిళకు అస్వస్థత

మదనపల్లె : పాముకాటుతో మహిళ అస్వస్థతకు గురైన సంఘటన బుధవారం కురబలకోట మండలంలో జరిగింది. ముదివేడు పంచాయతీ రెడ్డివారిపల్లెకు చెందిన రమణమ్మ(50) పొలం వద్ద పనులు చేసుకుంటుండగా, అకస్మాత్తుగా పాము కాటేసింది. దీంతో ఆమె తీవ్ర అస్వస్థతకు గురికాగా, గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాధితురాలిని మదనపల్లె ప్రభుత్వ సర్వజన బోధనాసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు.

నలుగురు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సమస్యలతో వేర్వేరు ప్రాంతాల్లో నలుగురు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ప్రభుత్వ సర్వజన బోధనాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కురబలకోట మండలం ముదివేడు పంచాయతీ ఎనుములవారిపల్లెకు చెందిన వసంత(28) ఇంటివద్దే పురుగుమందు తాగింది. మదనపల్లె మండలం కోళ్లబైలు పంచాయతీ దిగువమిట్టపల్లెకు చెందిన తిప్పయ్య(37) ఇంటివద్దే పురుగుమందు తాగాడు. పట్టణంలోని నీరుగట్టువారిపల్లెకు చెందిన శ్రీనివాసులు(32) పురుగుమందు తాగాడు. గుర్రంకొండకు చెందిన తేజస్విని(34) మంగళవారం రాత్రి ఇంటివద్దే పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. ఆయా ఘటనల్లో గమనించిన కుటుంబ సభ్యులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసులు దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం అదుపు తప్పి యువకుడి మృతి


ప్రకాష్ నాయక్(ఫైల్)

ములకలచెరువు : ద్విచక్ర వాహనం అదుపు తప్పి పిట్టగోడను ఢీకొనడంతో ఓ యువకుడు బుధవారం మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. సత్యసాయి జిల్లా తనకల్లు మండలం సుబ్బరాయునిపల్లికి చెందిన ప్రకాష్ నాయక్ (22) తిరుపతిలో డిగ్రీ చదువుతున్నాడు. ఈ నేపథ్యంలో యువకుడు బుధవారం వేకువజామున స్వగ్రామం నుంచి ద్విచక్ర వాహనంలో తిరుపతికి వెళుతూ మార్గమధ్యంలో మండలంలోని పెద్దపాళ్యం ఫ్లైఓవర్ వద్ద ఉన్న పిట్టగోడను ప్రమాదవశాత్తు ఢీకొని తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వైవీయూలో విద్యార్థుల మధ్య ఘర్షణ

- ఒకరికి రక్త గాయాలు
- మరో గ్రూపు విద్యార్థుల దాడిలో గెస్ట్‌హౌస్ అద్దాలు ధ్వంసం
- ఐదుగురు విద్యార్థులపై కేసు నమోదు


రక్తగాయమైన మైక్రో బయాలజీ విద్యార్థి సురేష్

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలో నివురుగప్పిన నిప్పులా ఉన్న విద్యార్థుల వర్గపోరుకు బుధవారం జరిగిన ఘటన ఆజ్యం పోసింది. ఉదయం విశ్వవిద్యాలయం అనుబంధ వసతి గృహంలోని మెస్ వద్ద ఘర్షణ చోటుచేసుకుంది. ఎంఎస్సీ మైక్రోబయాలజీ విద్యార్థి సురేష్, ఇంటిగ్రేటెడ్ ఎర్త్‌సైన్స్ విభాగం విద్యార్థి స్వామి మధ్య మాటామాటా పెరిగి స్వల్ప ఘర్షణ చోటు చేసుకుంది. ఈ క్రమంలో సురేష్ తన చేతిలో ఉన్న ప్లేట్‌తో స్వామిపై విసిరికొట్టాడు. అనంతరం వారిరువురూ వారి గదులకు వెళ్లిపోగా స్వామి తన గదికి వెళ్లి తోటి విద్యార్థులకు చెప్పడంతో ఇంటిగ్రేటెడ్ విద్యార్థులు ఒక్కసారిగా సురేష్ వద్దకు దాదాపు 20 మంది విద్యార్థులు విచ్చేసి సమీపంలో ఉన్న రైలింగ్ రాడ్‌తో దాడి చేశారు. దీంతో అతని తలకు రక్తగాయమైంది. వెంటనే సమీపంలోని వైవీయూ హెల్త్‌సెంటర్‌కు తీసుకువెళ్లి ప్రాథమిక చికిత్స చేయడంతో పాటు తలకు 5 కుట్లు వేశారు. విషయాన్ని సురేష్ తమ కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో వారు విశ్వవిద్యాలయానికి చేరుకుని దాడిచేసిన వారిపై ప్రతిదాడి చేసేందుకు యత్నించారు. ఈ క్రమంలో విశ్వవిద్యాలయం అతిథి గృహంలో ఓ ఆచార్యుడు ఉంటున్న గదిలో విద్యార్థులు ఉండగా వారిపై దాడి చేసేందుకు యత్నించగా, గెస్ట్‌హౌస్ అద్దాలు ధ్వంసమయ్యాయి. వైవీయూ అధికారుల సమాచారంతో కడప రూరల్ సీఐ చల్లనిదొర విశ్వవిద్యాలయానికి విచ్చేసి ఇరువర్గాల విద్యార్థులను మందలించడంతో పాటు, దాడికి పాల్పడిన ఐదుగురు విద్యార్థులను విచారణ నిమిత్తం పెండ్లిమర్రి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసినట్లు పెండ్లిమర్రి పోలీసులు తెలిపారు.

కాగా కొద్దిరోజులుగా మెస్ కమిటీ నిర్వహణ, ఆధిపత్య పోరులో భాగంగా గతంలో సైతం వర్గాలుగా విడిపోయి పరస్పరం దూషించుకున్న ఘటనలు ఉన్నాయి. వీటిపై గతంలోనే అధికారుల దృష్టికి తెచ్చినప్పటికీ వారు తేలికగా తీసుకోవడం, వసతి గృహాల పర్యవేక్షణ లోపించడం, ప్రిన్సిపాల్ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా వెళ్లడంతో పాటు వసతిగృహాల బాధ్యులు విద్యార్థుల సమస్యలను పట్టించుకోకపోవడంతో తరచూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని విద్యార్థులు ఆరోపిస్తున్నారు.

కాగా ఘటన జరిగిన తర్వాత వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య పి. పద్మ వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులందరూ ఐకమత్యంగా ఉండాలని, ఎలాంటి గొడవలకు పాల్పడరాదంటూ సూచించారు.

పోలీస్ అవుట్‌పోస్టు ఏర్పాటుకు డిమాండ్..

విశ్వవిద్యాలయంలో గతంలో పోలీసు అవుట్ పోస్టును ఏర్పాటు చేసినప్పటికీ అది కాలనుక్రమంలో అలంకార ప్రాయంగా మారింది. దీంతో ఇలాంటి ఘటనలు జరగకుండా ఉండాలంటే పోలీసు అవుట్ పోస్టు ఏర్పాటు చేయాలని విద్యార్థి నాయకులు డిమాండ్ చేస్తున్నారు. గాయపడిన సురేష్‌ను రాయలసీమ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి మల్లేల జగదీష్ పరామర్శించారు. దాడిచేసిన వారిపై కేసులు నమోదు చేయాలని కోరారు. వైవీయూ వీసీ, రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్స్‌పై కేసులు నమోదు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వి. గంగాసురేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు, అధ్యక్షుడు శివశంకర్‌లు వేర్వేరుగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు.

13 ఎర్రచందనం దుంగలు స్వాధీనం


టాస్క్‌ఫోర్స్ పోలీసుల అదుపులో ఎర్రచందనం దుంగలతో పట్టుబడిన కారు, ఇద్దరు స్మగ్లర్లు

రాయచోటి : రాయచోటి–మదనపల్లి మార్గంలో చేపట్టిన వాహనాల తనిఖీలలో 13 ఎర్రచందనం దుంగలు, కారును స్వాధీనం చేసుకొని ఇద్దరు స్మగ్లర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. చిన్నమండెం సమీపంలో కేశాపురం చెక్ పోస్టు వద్ద బుధవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఆర్ఐ చిరంజీవులు, ఆర్ఎస్ఐ ఎం.మురళీధర్ రెడ్డి బృందం రాయచోటి–మదనపల్లి రోడ్డులో ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లను పరిశీలించారు. చెక్‌పోస్టు వద్ద అనుమానాస్పద స్థితిలో అతివేగంగా ఇద్దరు వ్యక్తులు మోటార్ సైకిల్‌పై ముందు వెళ్తూ వెనుక కారులో దుంగలను తరలించే ప్రయత్నం చేశారు. అదే వేగంతో వారిని అనుసరిస్తూ టాస్క్ ఫోర్స్ పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయితే ఆ కారు తప్పించుకొని పోయే ప్రయత్నంలో ఒక రాయిని ఢీ కొని నిలిచిపోయింది. కారులోని ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారిని తమిళనాడు తిరువన్నామలై జిల్లాకు చెందిన వారిగా గుర్తించారు. కారులోని 13 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వాహనం, దుంగలు, స్మగ్లర్లను అదుపులోకి తీసుకొని తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రఫీ తెలిపారు.

అడవిలోకి చొరబడుతున్న స్మగ్లర్ అరెస్టు

రాజంపేట అటవీ ప్రాంతం పరిధిలో పిడిలేని గొడ్డళ్లతో అడవిలోకి వెళ్తున్న వ్యక్తిని రైల్వేకోడూరు సబ్ కంట్రోల్ ఆర్ఐ కృపానంద, ఆర్ఎస్ఐ రాఘవేంద్ర బృందం అదుపులోకి తీసుకుంది. మరికొందరు పరారయ్యారు. మోటారు సైకిల్, గొడ్డళ్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వ్యక్తి తమిళనాడు సేలం జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్‌లో సీఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

వేడుకగా ఆర్ట్స్ కళాశాల ప్లాటినం జూబ్లీ సెలబ్రేషన్స్

- 13, 14 తేదీల్లో అంగరంగ వైభవంగా నిర్వహణ
- ప్రిన్సిపాల్ జి. రవీంద్రనాథ్



వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల (ఆర్ట్స్ కళాశాల) ఏర్పాటై 75 సంవత్సరాలు పూర్తవుతున్న నేపథ్యంలో ఈనెల 13, 14 తేదీల్లో కళాశాలలో ప్లాటినం జూబ్లీ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ తెలిపారు. 1948లో ఏర్పాటైన ఈ కళాశాల రాయలసీమలోనే అత్యంత ప్రాచీనమైన, ప్రతిష్టాత్మక, ప్రసిద్ధ ఉన్నత విద్యాసంస్థ అని పేర్కొన్నారు. ఈ కళాశాలలో చదివిన ఎందరో విద్యార్థులు దేశ, విదేశాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడి తిరిగి కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకల్లో కలుసుకునేందుకు వస్తుండటం సంతోషంగా ఉందన్నారు. ప్లాటినం జూబ్లీ వేడుకల నేపథ్యంలో సెప్టెంబర్ 13, 14 తేదీల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. 13వ తేదీ ఉదయం 2 కే రన్, 75 వసంతాల పైలాన్, పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు, ప్రిన్సిపాల్స్‌కు సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పలు అతిథి ఉపన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. అదే విధంగా 14వ తేదీన జాయ్ ర్యాలీ, అలూమినీ కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వీడ్కోలు సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్లాటినం జూబ్లీ వేడుకలకు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, కడప ఎమ్మెల్యే ఆర్. మాధవిరెడ్డి, విద్యాశాఖ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్, విశ్రాంత చీఫ్ సెక్రటరీ డాక్టర్ కె.ఎస్. జవహర్‌రెడ్డి, కేంద్ర ప్రభుత్వ మాజీ అధికారి ప్రకాష్‌రావు, వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, పూర్వపు వైస్ చాన్సలర్‌లు, ఐఏఎస్‌లు, మాజీ ఐఏఎస్‌లు, వివిధ రంగాల ప్రముఖులు హాజరవుతున్నట్లు తెలిపారు.

ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లు విధుల నుంచి తొలగింపు

పెనగలూరు : మండలంలోని ఈటమాపురం పంచాయతీకి చెందిన ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించినట్లు అధికారులు తెలిపారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో సామాజిక తనిఖీ ప్రత్యేక సమావేశానికి జిల్లా నుంచి డ్వామా, డీఆర్‌డీఏ పీడీలు హాజరయ్యారు. సమావేశంలోనే ఇద్దరిని తొలగించినట్లు పీడీ ప్రకటించారు.

కూటమి ప్రభుత్వం ఇసుక పాలసీ పచ్చిమోసం


మాట్లాడుతున్న సీహెచ్ చంద్రశేఖర్

రైల్వేకోడూరు అర్బన్ : కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ పచ్చి మోసమని, గత ప్రభుత్వం కంటే ఇప్పుడు అధిక ధరలు ఉన్నాయని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ విమర్శించారు. స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఉచిత ఇసుక అని ప్రభుత్వం చెప్పినా సినరీస్, జీఎస్టీ, ట్రాన్స్‌పోర్ట్, పేరుతో వేలాది రూపాయలు దండుకొంటున్నారని ఆరోపించారు. ట్రాక్టర్ ఇసుక గతంలో 3000 రూపాయలకు వచ్చేదని, ఇప్పుడు రూ.8, 10 వేలు పెట్టినా దొరకడం లేదని తెలిపారు. లారీ ఇసుక 15 వేలకు పైగా వసూలు చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో జాన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చేతులెత్తేసిన సచివాలయ సిబ్బంది

– ఇసుక టోకెన్ల జారీపై ఒత్తిడి

రాజంపేట : కూచువారిపల్లి సచివాలయంలో ఇసుక బుకింగ్ టోకెన్లు ఇవ్వలేమని సచివాలయ సిబ్బంది చేతులెత్తేశారు. బుధవారం ఈ పరిస్థితులు నెలకొన్నాయి. కొన్ని రోజులుగా టోకెన్ల జారీపై రాజకీయ నాయకుల ఒత్తిడి అధికం కావడంతో సిబ్బందికి దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. కాగా తమను ఇసుక బుకింగ్ విధుల నుంచి తప్పించాలని ఎంపీడీఓకు నలుగురు సిబ్బంది వినతిపత్రాలు సమర్పించారు. ఒకరిని తప్పించి మరో ముగ్గురికి ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేసే వరకు కొనసాగాలని ఆదేశాలు జారీ చేశారు. ఏది ఏమైనప్పటికీ ఇసుక బుకింగ్ సచివాలయ సిబ్బందికి తంట తెచ్చిపెట్టింది. ఈ నేపథ్యంలో రాజంపేట సబ్ కలెక్టరేట్‌కు ఇసుక బుకింగ్ పాయింట్‌ను తరలించారు.

పది మంది పేకాటరాయుళ్ల అరెస్టు

కలకడ : పదిమంది పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బుధవారం మండలంలోని కదిరాయచెర్వు పంచాయతీ చిన్నగోగులవారిపల్లె సమీపంలోని గుండ్రెడ్డిబావి వద్ద పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు దాడి నిర్వహించామన్నారు. పేకాట ఆడుతున్న వారిని చుట్టుముట్టి పది మందిని అరెస్టు చేసి వారి వద్దనుంచి రూ.21,440 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

చిరుతను చూసి భయపడి.. స్కూటీ నుంచి కిందపడి..

– ఇరువురికి గాయాలు

ముద్దనూరు : ముద్దనూరు–జమ్మలమడుగు రహదారిలో ఘాట్‌రోడ్డులో చిరుతను చూసి భయంతో తప్పించుకోబోయిన స్కూటరిస్టు కిందపడటంతో ఇరువురికి కాలు విరిగింది. బాధితుల సమాచారం మేరకు జమ్మలమడుగుకు చెందిన ఇమ్రాన్, ఇబ్రహీం అనే వ్యక్తులు బుధవారం తెల్లవారుజామున స్కూటీపై ముద్దనూరుకు ప్రయాణిస్తున్నారు. మునయ్యకోన దాటిన తర్వాత చిరుత రహదారిని దాటుతుండగా ఇరువురు చూశారు. భయంతో స్కూటీతో రోడ్డు పక్కకు వెళ్లారు. దీంతో స్కూటీ దిగువ ప్రాంతంలో బోల్తాపడింది. ఈ దారిలో వెళ్లేవారు వెలుగుతున్న స్కూటీ లైట్లను చూసి 108 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. క్షతగాత్రులిద్దరినీ జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అలా అమ్మారు.. ఇలా చోరీ చేశారు..

బ్రహ్మంగారిమఠం : మండలంలోని లింగాలదిన్నెపల్లెకు చెందిన లెక్కల భాస్కర్‌రెడ్డి సుజికి డిజైర్ కారు చోరీకి గురైన కేసును బి.మఠం పోలీసులు ఛేదించారు. బుధవారం రాత్రి బి.మఠంలో రూరల్ సీఐ శివశంకర్ విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం తెల్లవారుజామున భాస్కర్‌రెడ్డి ఇంటి దగ్గర ఉన్న కారును ఇతనికి కారు అమ్మిన రామనాథ్‌రెడ్డి, హరికృష్ణారెడ్డిలే దొంగిలించినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో పోలీసులు వారిని అరెస్టు చేశారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ

– ముగ్గురికి గాయాలు


రోడ్డుప్రమాదంలో గాయపడిన ఎస్‌పి నాగన్న, చంద్రయ్య, మల్లికార్జున

కలకడ : రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొన్న సంఘటనలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై కలకడ వద్ద జరిగిన ఈ సంఘటన వివరాలు ఇలా.. సంబేపల్లె మండలం సోత్రియంసోమవరం పంచాయతీ అగ్రహారం గ్రామానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఎస్.పి. నాగన్న తన ద్విచక్రవాహనంలో కలకడకు వస్తున్న సమయంలో కలకడ మండలం, బాలయ్యగారిపల్లె పంచాయతీ ఎస్టీ కాలనీకి చెందిన మల్లికార్జున అతని ద్విచక్రవాహనంతో ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో మల్లికార్జునకు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు నాగన్నకు, అలాగే నాగన్న ద్విచక్రవాహనంలో కూర్చుని ఉన్న కలకడ మండలం, గుడిబండ పంచాయతీ తోళ్లపల్లె గ్రామానికి చెందిన చంద్రయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో గాయపడిన వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు వారి బంధువులు తెలిపారు.

లింగ నిర్ధారణ చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న పీసీపీఎన్‌డీటీ జిల్లా నోడల్ అధికారి ఉషశ్రీ

రాయచోటి అర్బన్ : గర్భస్థ పిండ లింగనిర్ధారణ చట్టాన్ని అతిక్రమించే స్కానింగ్ సెంటర్ నిర్వాహకులపై కఠిన చర్యలు తప్పవని గర్భస్థలింగ నిర్ధారణ వ్యతిరేక చట్టం (పీసీపీఎన్‌డీటీ)జిల్లా నోడల్ అధికారి ఉషశ్రీ పేర్కొన్నారు. బుధవారం ఆర్‌డీఓ కార్యాలయంలో గర్భస్థలింగ నిర్ధారణ వ్యతిరేక చట్టం (పీసీపీఎన్‌డీటీ)పై ఆర్‌డీఓ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నోడల్ అధికారి మాట్లాడుతూ ఫారం ఎఫ్‌ను గత 3 నెలలుగా ఆన్‌లైన్ లో అప్‌లోడ్ చేయని 13 స్కానింగ్ సెంటర్ నిర్వాహకులకు షోకాజ్ నోటీసులు ఇచ్చామన్నారు. ఆర్‌డీఓ రంగస్వామి మాట్లాడుతూ షోకాజ్ నోటీసులకు సమాధానం ఇవ్వని స్కానింగ్ సెంటర్‌ల నిర్వాహకులకు రూ. 20వేల చొప్పున జరిమానా విధిస్తామన్నారు. జిల్లా ప్రోగ్రాం అధికారి దేవశిరోమణి మాట్లాడారు. కమిటీ సభ్యులు సురేందర్‌రెడ్డి, నాగేశ్వర, వైద్యుడు నిస్సార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజమ్మ, హెల్త్‌ఎడ్యుకేటర్‌లు ఉషా రాణి, సుగుణ, రాజగోపాల్, పలువురు స్కానింగ్ సెంటర్‌ల నిర్వాహకులు పాల్గొన్నారు.

ఐదో రోజూ.. అదే జోరు


వినాయకస్వామి ప్రత్యేక పూజలో ఎమ్మెల్యే ఆకేపాటి


ఎంజీ పురంలో రూ.1 లక్షా 67 వేలకు లడ్డూను దక్కించుకున్న వెంకటసుబ్బయ్య


రూ.1 లక్షా 40 వేలకు లడ్డూను దక్కించుకున్న లక్ష్మీకర్‌రెడ్డి

- పోటా పోటీగా గణనాథుని లడ్డు వేలం పాటలు
- రూ.లక్షల్లో దక్కించుకున్న భక్తులు

రాజంపేట రూరల్ : మహాగణపతి ఉత్సవాలు బుధవారం ఐదో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో గణనాథులు నిమజ్జనానికి కదిలారు. ఆకేపాటి ఎస్టేట్ వద్ద ఉన్న ఆకేపాటి కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన వినాయకస్వామికి 5వ రోజు నిర్వహించిన ప్రత్యేక పూజలలో ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి పాల్గొన్నారు. అనంతరం వినాయకస్వామి ఉత్సవ విగ్రహం ఎస్టేట్‌కు వచ్చిన సమయంలో ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, జ్యోతమ్మ దంపతులు హారతులిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అదే విధంగా ఎంజీ పురంలో వినాయక చవితి 20వ వార్షికోత్సవంలో భాగంగా నిర్వహించిన వేలం పాటలో అదే గ్రామానికి చెందిన గొడ్డేటి వెంకటసుబ్బయ్య రూ. 1 లక్షా 67 వేలు అధిక వేలం ధరకు స్వామి వారి లడ్డును దక్కించుకున్నారు. సాయినగర్‌లో నిర్వహించిన వేలం పాటలో పోలి లక్ష్మీకర్‌రెడ్డి రూ. 1 లక్షా 40 వేలకు స్వామి వారి లడ్డూను దక్కించుకున్నారు. ఈ నిమజ్జన వేడుకల్లో మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రూ. 60 వేలు పలికిన వినాయకుని లడ్డు

సుండుపల్లె : మండల కేంద్రానికి సమీపంలోని అగ్రహారం వినాయకుని మండపం వద్ద నిర్వహించిన లడ్డు వేలం పాటలో కోటకొండ రోశయ్య రూ. 60 వేలకు దక్కించుకున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. అలాగే కలశం, టెంకాయను వెంకటరమణ రూ. 23,500లకు, రూపాయి బిళ్లను వెంకటేష్ రూ. 18 వేలకు వేలంలో దక్కించుకున్నట్లు తెలిపారు.


ఏటిగడ్డ రాచపల్లిలో గ్రామస్తులు నిర్వహించిన లడ్డు వేలంపాటలో అద్దపల్లి నాగరాజు రూ. 32 వేలకు దక్కించుకున్నారు.

నందలూరు మండలంలో..



నందలూరు : నందలూరు గ్రామ పంచాయతీ నీలిపల్లి గ్రామంలో వినాయక స్వామి లడ్డు వేలం పాటలో ఉప్పుశెట్టి నరసింహులు అత్యధికంగా రూ. 1 లక్షా 5 వేలకు స్వామివారి లడ్డును దక్కించుకున్నారు. ఉప్పుశెట్టి సుధీర్ కుమార్, ఉప్పుశెట్టి హరికృష్ణ, ఉప్పుశెట్టి ప్రసాద్, దాసరి కాటయ్య, ఉప్పుశెట్టి కొండయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వేముల మండలంలో..

వేముల: వేములలో బుధవారం వినాయకుని లడ్డును వేములకు చెందిన చందా రమేష్‌రెడ్డి రూ.1.11 లక్షలకు దక్కించుకున్నారు. అనంతరం వినాయకుని నిమజ్జన వేడుకలు ఘనంగా జరిగాయి.



ఓబులవారిపల్లెలో..



ఓబులవారిపల్లె: మండలంలోని చిన్నఓరంపాడు, దిగువపల్లి గ్రామంలో బుధవారం వినాయక లడ్డు వేలం పాటలో వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ ముక్కా శైలజ రమేష్ రెడ్డి స్వామివారి లడ్డును రూ. 80 వేలకు కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

లింగాల మండలంలో..

లింగాల : లింగాల మండలం పెద్దకుడాల గ్రామంలో వినాయకుని లడ్డును గ్రామానికి చెందిన పెద్దమల్లు లక్ష్మినారాయణరెడ్డి రూ.లక్షకు కైవసం చేసుకున్నారు. ఆయనను వినాయకుని ఉత్సవ కమిటీ ఘనంగా సత్కరించింది.



జమ్మలమడుగులో..



జమ్మలమడుగు : పట్టణంలోని సిద్ధి వినాయక సేవా సమితి ఆధ్వర్యంలో ఈశ్వర నగర్‌లో స్వామి వారి వద్ద ఉంచిన చెరుకు గడ్డలు, కలశం చెంబు, లడ్డులను వేలంపాట నిర్వహించారు. రెండు వందల రూపాయల విలువ గల చెరుకు గడలను రామకృష్ణారెడ్డి రూ.10,100కు దక్కించుకున్నారు. కలశం చెంబు రూ.600 విలువ ఉంటే మమతాదేవి రూ.42 వేలకు, వెండి విగ్రహాన్ని రూ.61వేలకు రామకృష్ణారెడ్డి దక్కించుకున్నారు. లడ్డును అత్యధికంగా రూ.71వేలకు టి.మనోజ్‌కుమార్ దక్కించుకున్నారు.

పోరుమామిళ్ల మండలంలో..

పోరుమామిళ్ల : రంగసముద్రం రెడ్డినగర్‌లోని శ్రీ వరసిద్ధి వినాయక కోదండ రామస్వామి ఆలయం వద్ద బుధవారం నిర్వహించిన వేలంలో రూ. 54 వేలతో చిలమల రామసుబ్బయ్య లడ్డును దక్కించుకున్నారు. వెంగమాంబ నగర్ వద్ద రూ. 51 వేలతో సుంకర ప్రసాద్, లక్ష్మిదేవి దంపతులు, పట్టణంలోని కోటవీధిలో రూ. 49 వేలకు చెన్ను వెంకటరమణ, శీనప్పబావివీధిలో 300 కేజీల లడ్డును రూ. 21 వేలకు బావులూరి వెంకటేశ్, చితానందనగర్‌లో రూ. 27 వేలకు రమణయ్య వినాయక లడ్డును సొంతం చేసుకున్నారు. ఇదిలా ఉండగా రంగసముద్రం పంచాయతీ కమ్మవారిపల్లెలో నిర్వహించిన లడ్డు వేలంలో పాద రమణయ్య రూ.1,35,000కు లడ్డును సొంతం చేసుకున్నారు. ఈ సంవత్సరం మండలంలో ఇదే అత్యధిక వేలంగా భావిస్తున్నారు.



కలసపాడులో..



కలసపాడు : మండలంలోని దూలంవారిపల్లె గ్రామంలో లడ్డు వేలం పాటలో గ్రామానికి చెందిన పంజగల వెంకటేష్ రూ.లక్షకు లడ్డును దక్కించుకున్నారు. అలాగే రూ.11,300లకు కలశంను కూడా దక్కించుకున్నారు.